క్లుప్తంగా

లాకిన్స్‌లాకు పెరిగిన నీటి మట్టం



కేసీ కెనాల్‌లో ప్రవహిస్తున్న నీరు

పాములపాడు:మండలంలోని శాంతిని లయం గ్రామ సమీపంలోని కేసీ కెనాల్ 120వ కిలోమీటర్ లాకిన్స్‌లా వద్ద నీటి మట్టం 6.4 అడుగులకు పెరిగినట్లు ఏఈఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సుంకేసుల నుంచి 2,100 క్యూసెక్కుల నీరు లాకిన్స్‌లాకు వచ్చి చేరుతుందన్నారు. దీంతో 4 అడుగుల నుంచి 6.4 అడుగులకు నీటి మట్టం పెరిగిందని వివరించారు. కాగా నిప్పులవాగుకు 250, కేసీసీ(తూడిచెర్ల ఎస్కేప్ చానల్)కు 247, అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు 20 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

కుమారస్వామికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో ఆదివారం కృత్తికా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులు నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేకం చేశారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



హెడ్ కానిస్టేబుల్‌ను సన్మానిస్తున్న ఎస్‌ఐ, పోలీసులు

నందికొట్కూరు: స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా నుంచి ఉత్కృష్ట సేవా పతకం అవార్డును హెడ్ కానిస్టేబుల్ కే.నూర్ అమీద్ ఈ నెల 15న అందుకున్నారు. ఆదివారం బ్రాహ్మణ కొట్కూరు పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌ను ఎస్‌ఐ తిరుపాలు, పోలీసులు ఘనంగా సన్మానించారు.ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రజలకు నిజాయితీగా సేవలు అందించే వారికి గుర్తింపు లభిస్తుందన్నారు.

కెమికల్ ఫ్యాక్టరీ నిర్మాణంపై స్పష్టత ఇవ్వాలి



నిర్మాణంలో ఉన్న కెమికల్స్ ఫ్యాక్టరీని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

జూపాడుబంగ్లా: తంగెడంచ గ్రామ రెవెన్యూ పరిధిలో నిర్మిస్తున్న ఆర్టీయా ఆగ్రో కెమికల్స్ ఫ్యాక్టరీ నిర్మాణ వివరాలు తెలియజేయాలని సీపీఎం నాయకులు పక్కీర్‌సాహెబ్, గోపాలకృష్ణ, కర్ణ డిమాండ్ చేశారు. ఆదివారం నిర్మాణంలోనున్న ఫ్యాక్టరీని పరిశీలించారు. వారు విలేకరులతో మాట్లాడుతూ ఫ్యాక్టరీ వివరాలను బహిర్గతం చేయకుండా యాజమాన్యం, ఏపీఐఐసీ అధికారులు గోప్యత పాటించడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. తాము ఫ్యాక్టరీని పరిశీలించడానికి వెళ్లేందుకు అక్కడున్న సిబ్బంది అనుమతి నిరాకరించడం సమంజసం కాదన్నారు.

పుష్కలంగా ఎరువులు



ఫర్టిలైజర్ షాపులో రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ హేమలత

ఆత్మకూరు: డివిజన్ పరిధిలో రైతులకు కావాల్సిన ఎరువులు పుష్కలంగా ఉన్నాయని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏఓ హేమలత తెలిపారు. పట్టణంలోని వివిధ ఫర్టిలైజర్ షాపులను ఆదివారం తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఆత్మకూరు డివిజన్‌లోని ఆత్మకూరు, వెలుగోడు, పాములపాడు, కొత్తపల్లి మండలాల్లో 3,623.46 మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేశామన్నారు. ఈ వారంలో మరో 733 మెట్రిక్ టన్నులు రైతుసేవా కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా పంపిణీ చేస్తామని చెప్పారు. ఎకరాకు 2 బస్తాల యూరియా మాత్రమే వేయాలని, అంతకుమించి వేస్తే పైరు ఏపుగా పెరిగి తెగుళ్లు సోకే అవకాశం ఉందన్నారు. కురుస్తున్న వర్షాలకు యూరియాను వాడడం వల్ల పంట పెరుగుదల ఎక్కువై ఒరిగిపోతుందన్నారు. రైతులు నానో యూరియాను కూడా ఉపయోగించాలని కోరారు.

కాలి బాటతో అధిక దిగుబడి

- ఈ పద్ధతితో వరి సాగులో ఖర్చు ఆదా
- ఆసక్తి చూపుతున్న రైతులు



బండిఆత్మకూరులో కాలిబాట వేసిన వరిపొలం

బండిఆత్మకూరు: వరి సాగులో కాలిబాటలతో ప్రయోజనాలున్నాయని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా పైరుకు చీడపీడల సమస్య ఉండదు. పెట్టుబడి వ్యయం తగ్గి దిగుబడి పెరుగుతుంది. అయితే చాలా మంది రైతులు కాలిబాటలు వేయడానికి తటపటాయిస్తుంటారు. దీనిని అనవసర వ్యయంగా భావిస్తారు. ఎకరం పొలంలో కాలిబాటలు వేయడానికి సుమారు రూ.1500 ఖర్చవుతుంది. అయితే దిగుబడిలో సుమారు నాలుగు బస్తాల వరకు పెరుగుదల కనిపిస్తుంది.

కాలిబాటలు వేసే విధానం..

కాలిబాటలు వేసుకునే సమయంలో రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలి. పొడవైన ప్లాస్టిక్ తాడును గట్టుకు ఒకవైపు నుంచి రెండో వైపు వరకూ సాగదీసి కట్టాలి. తాడువెంబడి 12 సెంటీమీటర్ల వెడల్పున వరినాట్లు తొలగించి పక్కనే పలుచగా ఉన్న చోట నాటుకోవాలి. పొలం గట్టు పక్క నుంచి అడుగు దూరంలో కాలిబాట వేసి అక్కడి నుంచి ప్రతి రెండు మీటర్ల దూరంలో ఒక బాట వేయాలి. కొందరు రైతులు ప్రతి 6 నుంచి 7మీటర్లకు ఒక కాలిబాట వేస్తుంటారు. దీని వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదు. ముందు నాట్లు వేసిన రైతులు గట్లకు ఇరువైపులా తాడు కట్టి మార్కు చేసిన చోట ఉన్న మొక్కలను తీసి వేసి కాలి బాట వేస్తుంటారు. వెదజల్లే పద్ధతిలో అయితే పైరు ఎదుగుతున్న సమయంలో 15 నుంచి 20 రోజుల వ్యవధిలో 20 సెంటీమీటర్ల వెడల్పులో వరినాట్లు తొలగించి కాలిబాట వేసుకోవచ్చు.

ప్రయోజనాలు..

- కాలిబాటతో పైరు మొదళ్ల వరకూ వెలుతురు, గాలి, ఎండ సమృద్ధిగా తగులుతుంది. పైరు ఆరోగ్యంగా ఎదుగుతుంది. చీడపీడల బెడద కొంత వరకు తగ్గుతుంది.
- కాలిబాట మార్గంలో వెళ్లి కలుపు మొక్కలు తొలగించడానికి, మందులు చల్లుకోవడానికి వీలవుతుంది.
- తెగుళ్ల గుర్తించి సస్యరక్షణ చర్యలు తీసుకోవడానికి, ఎలుకల నివారణకు ఉపయుక్తంగా ఉంటాయి. తుపానులు, భారీ వర్షాలు వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఎదురైనప్పుడు పంట పొలాల్లో మొక్కల్లో కిరణ జన్య సంయోగక్రియ సమర్థవంతంగా జరిగి దిగుబడి పెరుగుతుంది.
- పైరులో చీడపీడల ఉధృతిని అతి సమీపం నుంచి గమనించి, దానికి అనుగుణంగా సకాలంలో సస్య రక్షణ తీసుకునే వీలు కలుగుతుంది.

తెగుళ్లను సులువుగా గుర్తించవచ్చు



వరి పంటలో కాలిబాట వేసి సాగు చేస్తున్నాను. దీని వల్ల పైరుకు పాలం మధ్యలో తెగుళ్లు, చీడపీడలు ఆశించినా గుర్తించే వీలుంటుంది. పురుగు మందులు, ఎరువులు వేయడానికి ఉపయోగంగా ఉంటుంది. ఈ సార్వాలో కూడా పొలంలో కాలి బాటలు వేసుకున్నాను.

– వెంకటేశ్వరరెడ్డి, రైతు, లింగాపురం

అదనంగా దిగుబడి



కాలిబాటలు వేయడంతో దిగుబడి ఏ మాత్రం తగ్గదు. పైగా రెండు, మూడు బస్తాలు అదనంగా వస్తుంది. కాలి బాటల వల్ల సస్యరక్షణ చర్యలు చేపట్టడం సులువవుతుంది. వ్యవసాయ నిపుణుల సూచనల మేరకు పొలంలో కాలిబాటలు వేసు కుంటే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. – పవన్‌కుమార్, వ్యవసాయాధికారి, బండిఆత్మకూరు

59వేల ఎకరాల్లో వరి సాగు..

శ్రీశైలం నియోజకవర్గంలోని ఆత్మకూరు మండలంలో 15వేల ఎకరాల్లో, మహానందిలో 8వేలు, బండిఆత్మకూరులో 27వేలు, వెలుగోడు మండలంలో 9వేల ఎకరాల్లో మొత్తం ఈ సీజన్‌లో 59వేల ఎకరాల్లో వరి పంట సాగు చేస్తారు. ఇప్పటి వరకు సుమారు 70 శాతం వరి నాట్లు పూర్తయ్యాయి.

ఈరోజు

శ్రీశైలంలో ఉచిత వైద్య శిబిరం

శ్రీశైలంటెంపుల్: దేవస్థాన సిబ్బంది, శ్రీశైల వాసులు, భక్తుల సౌకర్యార్థం దేవస్థానం వైద్యశాలలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఈఓ మాట్లాడుతూ తాడిపత్రికి చెందిన ఎం.మల్లికార్జున నాయుడి సహకారంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎముకలు, నరాలు, కండరాల వ్యాధులకు వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తారని చెప్పారు. అలాగే చిన్నపిల్లలకు కూడా వైద్య పరీక్షలు చేసి మందులు ఇస్తామన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

పాములపాడు: స్థానిక ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్, తహసీల్దార్ సుభద్రమ్మ ఆదివారం తెలిపారు. మండలంలోని ప్రజలు ఎదుర్కొంటున్న వ్యక్తిగత, గ్రామాల్లోని సమస్యలకు సంబంధించి వినతి పత్రాలుఅందజేస్తే.. వాటిని ఆయా శాఖల అధికారులకు పంపి పరిష్కారానికి చర్యలు తీసుకునేలా చూస్తామని చెప్పారు.

వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



శ్రీకృష్ణుని ఉత్సవమూర్తిని ఊరేగిస్తున్న దృశ్యం

పగిడ్యాల: స్థానిక యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు వైభవంగా సాగాయి. శ్రీకృష్ణుని ఉత్సవ విగ్రహాన్ని ట్రాక్టర్‌లో ఉంచి గ్రామంలో ఊరేగించారు. బీరప్ప డోలు వాయిద్యాల సందడితో ఊరేగింపుగా ఆంజనేయస్వామి దేవాలయం నుంచి..ఊరవాకిలి మీదుగా కోట వీధి, దేవనగర్ కాలనీ, బస్టాండు ఏరియా మీదుగా సాగింది. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

కార్మిక చట్టాల్లో మార్పులు ఎవరి కోసం?



మాట్లాడుతున్న సీఐటీయు జిల్లా అధ్యక్షుడు యేసురత్నం

కొత్తపల్లి: కార్మిక చట్టాల్లో మార్పులను ఎవరికోసం తీసుకొస్తున్నారని, అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమ బోర్డు ఏమైందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వి.యేసురత్నం, జిల్లా నాయకులు డి.రామ్ నాయక్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆదివారం మండల కేంద్రంలో సంఘం మండల మహాసభ నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడులుగా మార్చి వారి హక్కులను హరిస్తోందని విమర్శించారు. కార్పొరేట్లకు అనుకూలంగా చట్టాల్లో మార్పులు తీసుకొస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అసంఘటిత రంగ కార్మికులకు ఏర్పాటు చేస్తామన్న సంక్షేమ బోర్డు ఏమైందని నిలదీశారు. ఫిక్స్ టర్మ్ ఎంప్లాయిమెంట్ స్కీం పేరుతో కొత్తగా ఉద్యోగంలో చేరిన వారికి వేతనాన్ని ఏమాత్రం పెంచకుండా రిటైర్మెంట్ వరకు అదే వేతనం కొనసాగించడం, వేతనం పెంచమని అడిగే హక్కును లేకుండా చేయడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. కార్మిక వ్యతిరేక చట్టాలను ప్రతిఘటించేందుకు కార్మిక వర్గం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా కలాం, కార్యదర్శిగా దినేష్, ఉపాధ్యక్షులుగా శేఖర్, శ్రీదేవి, సహాయ కార్యదర్శులుగా హరిత, ఉమామహేశ్వరి, కోశాధికారిగా అబ్దుల్ రెహమాన్ తోపాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. వ్యవసాయ కమిషన్ జిల్లా కార్యదర్శి నరసింహ నాయక్, సహాయ కార్యదర్శి స్వాములు, అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్నం భోజనం, వీవోఏ, ఆటో కార్మికులు, స్వచ్ఛభారత్, హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా ఎస్‌ఐ బదిలీ

జూపాడుబంగ్లా: స్థానిక ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మీనారాయణ బదిలీ కావడంపై మండలంలో చర్చనీయాంశంగా మారింది. పక్షం రోజుల క్రితం కాలు బెనకడంతో స్వల్పంగా అస్వస్థతకు గురయ్యారు. దీంతో అప్పటి నుంచి సెలవులో ఉన్నారు. ఆదివారంతో సెలవు గడువు ముగియడం, ఆరోగ్యం కుదుట పడకపోవడంతో సెలవులు పొడగించుకొనేందుకు యత్నిస్తున్నాడు. ఈ క్రమంలో రాజకీయ నాయకులు బదిలీ చేయించినట్లు చర్చసాగుతోంది. ఎస్‌ఐ లక్ష్మీనారాయణ జూపాడుబంగ్లా నుంచి కర్నూలు పోలీసు శిక్షణ కేంద్రానికి బదిలీ అయ్యారు. జిల్లా ఎస్పీ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఆయన ఆదివారం విధుల నుంచి రిలీవ్ అయ్యారు. ఈ స్థానానికి ఐదుగురు ఎస్‌ఐలు వచ్చేందుకు పోటీ పడుతున్నట్లు తెలిసింది.

యూరియా కొరతను పరిష్కరించాలి

ఆత్మకూరు: మండలంలో యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి రణధీర్, కార్యదర్శి సుధాకర్ అన్నారు. పట్టణంలోని ఫర్టిలైజర్ షాపుల వద్ద ఆదివారం యూరియా కోసం పెద్ద ఎత్తున వచ్చిన రైతులతో మాట్లాడారు. వారు మాట్లాడుతూ రైతులకు యూరియాను ప్రైవేట్ దుకాణాల ద్వారా కాకుండా రైతుభరోసా కేంద్రాల ద్వారా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కొందరు దుకాణదారులు రెండు సంచుల యూరియాతో పాటు అదనంగా జింకు లేదా నానో యూరియాను అంటగడుతున్నారన్నారు. దీంతో రైతుకు రూ.1200 నుంచి రూ.1500 దాకా అధికంగా ఖర్చవుతుందన్నారు. రెండు బస్తాల యూరియా కోసం రైతులు రాత్రి, పగలు ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొందన్నారు.

అడవి పందుల నుంచి రక్షణ కల్పించండి



అడవిపందులు నాశనం చేసిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

కొత్తపల్లి: ఆరుగాలం కష్టించి సాగుచేసిన పంటలు చేతికొచ్చే సమయంలో అడవిపందులు పొలాల్లో పడి నాశనం చేస్తున్నాయని వాటి నుంచి తమ పంటలను కాపాడాలని రైతులు శ్రీనివాసులు యాదవ్, శేషన్న, హరికృష్ణ, శ్రీరాములు, చెంచన్న, లింగస్వాములు అటవీశాఖ అధికారులను కోరారు. ఆదివారం పెద్దగుమ్మడాపురం సమీపంలో శనివారం రాత్రి అటవి పందులు దాడిచేసిన మొక్కజొన్న పంటను అటవీ శాఖ గుమ్మడాపురం బీట్ అధికారి బాలజీతో పరిశీలించారు. ముందుగా ఏఏ ప్రదేశాల్లో ఎంతమేరకు అడవి పందులు మొక్కజొన్న పంటలను నాశనం చేశాయో పరిశీలించారు. సుమారు 20 ఎకరాల్లో పంటను అడవి పందులు నాశనం చేశాయని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ఇప్పించాలని రైతులు కోరారు. ఆయన స్పందిస్తూ.. సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేస్తానని చెప్పారు.



ఆత్మకూరులో కురుస్తున్న వర్షం

మోస్తరు వర్షం

ఆత్మకూరు: పట్టణం, మండలంలో ఆదివారం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. రెవెన్యూ అధికారుల ప్రకారం ఆత్మకూరులో 1.2 మి.మీ. వర్షం కురిసినట్లు తెలిపారు. మండలంలో ఈ నెలలో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈనెల 6న 31.2 మి.మీ., 8న 3.8 మి.మీ, 11న 52.8 మి.మీ., 12న 39.4 మి.మీ., 13న 12.8 మి.మీ., 14న 23.6 మి.మీ., 15న 5.2 మి.మీ., 16న 0.2 మి.మీ.,17న 1.2 మి.మీ. ప్రకారం వర్షాలు కురవడంతో రైతులు సాగు చేసిన మెట్ట వరి, మొక్కజొన్న, కంది పంటలకు అనుకూలించాయి. భారీ వర్షాలు కురవడంతో మండలంలోని వరదరాజస్వామి ప్రాజెక్టుతో పాటు కరివేన, ఇందిరేశ్వరం, వడ్లరామాపురం, కురుకుంద చెరువుల్లో భారీగా వరదనీరు చేరింది.

- మహానంది: క్షేత్ర పరిసరాలతో పాటు సమీప గ్రామాల్లో ఆదివారం సాయంత్రం నుంచి మోస్తరు వర్షం కురిసింది. రోజూ కురుస్తున్న వర్షాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉండగా లోతట్టు కాలనీలలో ఉంటున్న వారు ఇళ్లల్లోకి ఎక్కడ వర్షపు నీరు వస్తుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తుపాను ప్రభావంతో కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో అరటి పొలాల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

అభివృద్ధికి దూరంగా..

- విజయదుర్గా చెంచుకాలనీ–2లో కనీస వసతులు కరువు
- పూరి గుడిసెలు, బురద గుంతల మధ్య జీవనం
- ఉపాధి లేక భిక్షాటన చేస్తున్న వైనం
- పట్టించుకోని పాలకులు



విజయదుర్గా చెంచు కాలనీ

వెలుగోడు: ప్రపంచం మొత్తం 4జీ, 5జీ,6జీ అని పరుగులు తీస్తుంటే నల్లమల చెంచుల జీవనం మాత్రం ఆదిమ యుగంలోనే ఆగింది. వెలుగోడు పట్టణ శివారులో నివసిస్తున్న చెంచుల జీవనశైలిలో నేటికీ ఎలాంటి మార్పు లేదు. అడవే సర్వస్వంగా తరతరాలుగా ఉంటున్న చెంచులకు కనీస సౌకర్యాలు కరువై తీవ్ర ఇబ్బందులు ఎదర్కొంటున్నారు. పక్క ఇళ్లు లేక పూరి గుడిసెల్లోనే కాలం వెళ్లదీస్తున్నారు. చేసేందుకు ఉపాధి లేక, తినేందుకు తిండి లేక భిక్షాటన చేస్తూ దుర్భర జీవితం గడుపుతున్నారు.

20 ఏళ్ల క్రితం..

స్థానిక విజయదుర్గా చెంచుకాలనీలో నివాసముంటున్న 60 కుటుంబాలకు స్థానిక ఎస్‌ఎస్‌ఎస్‌ఆర్ డిగ్రీ కాలేజీ వెనుక భాగంలో ఇళ్ల స్థలాలు ఇచ్చినా..పక్కా ఇల్లు మంజూరు చేయడం ప్రభుత్వాలు మరిచిపోయాయి. దీంతో పూరి గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నారు. కాలనీకి వెళ్లేందుకు సరైన రోడ్డు మార్గం కూడా ఏర్పాటు చేయకపోవడంతో వర్షకాలంలో బురద గుంతలు, ఎండకాలంలో మట్టి రోడ్లపై రాకపోకలు సాగిస్తున్నారు. వెదురు బొంగులతో నిర్మించుకున్న గుడిసెలు వర్షం వస్తే వెలుస్తుంటాయి. ఎండకాలంలో అగ్నిప్రమాదాలకు జరుగుతుంటాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో ఇళ్లలోకి వర్షం నీరు చేరి కనీసం కూర్చునేందుకు కూడా స్థలం లేక పట్టణంలోని వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద, రోడ్డుపై కూర్చుంటున్నారు.

భిక్షాటనే ఉపాధి..

అడవిపై ఆధారపడి జీవిస్తున్న చెంచులకు ఉపాధి కరువైంది. ప్రభుత్వ సాయం లేక పొట్ట నింపుకునేందుకు తమ పిల్లలను వెలుగోడు పట్టణంలోని ఇళ్ల వెంట పంపించి భిక్షాటన చేయిస్తున్నారు. వారు అలా తెచ్చిన ఆహారాన్ని తలా కొంచెం తిని పూట గడుపుతున్నారు.

ఆర్భాటం తప్పా.. అభివద్ధి ఏదీ?..

అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం వచ్చిందంటే చాలు ఆ రోజు ఐటీడీఏ, ఆర్టీటీ సంస్థ, ఆదివాసి సంఘాల ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిపేందుకు ఘనంగా ఏర్పాట్లు చేస్తారు. కానీ మరుసటి రోజు నుంచి వారి గురించి ఆలోచించే తీరిక కూడా అధికారులకు ఉండదు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు వారికి ఇంకా ఆమడ దూరంలోనే ఉన్నాయి. పోషకాహారం లోపంతో మహిళలు, చిన్నారులు మత్యువాత పడుతుండగా మరికొందరు వివిధ వ్యాధులతో కాలం నెట్టుకొస్తున్నారు. వీరికి మౌలిక వసతులు కల్పించేందుకు బడ్జెట్‌లో రూ.కోట్లు ఖర్చు పెడుతున్నట్లు లెక్కలు చూపుతున్నా.. అవి ఎక్కడికి పోతున్నాయే ఇప్పటికీ ప్రశ్నార్థకమే. తమ సమస్యలు పరిష్కరించాలని చెంచులు పలుమార్లు అధికారులు, రాజకీయ నాయకులకు వినతిపత్రాలు ఇస్తున్నా ఫలితం కనిపించడం లేదు.

పక్కా ఇల్లు నిర్మించాలి



గుడిసెల్లోనే ఉంటున్నాం. వర్షం వస్తే కారుతున్నాయి. రాత్రిళ్లు నిద్ర ఉండటం లేదు. పాములు, తేళ్లు వస్తుంటాయి. పక్కా ఇల్లు నిర్మిస్తే బాగుంటుంది. – ఊమని మూగమ్మ

రోడ్డు వేయాలి



విజయదుర్గ చెంచుకాలనీ–2కు ఇంతవరకు రోడ్డు వేయలేదు. బురదలోనే నడుచుకుంటూ వెళ్తున్నాం. పిల్లలు, ముసలొళ్లు జారిపడుతున్నారు. కాలనీలో ఎలాంటి సౌకర్యాలు లేవు. అధికారులకు ఎన్ని మార్లు చెప్పుకున్నా పట్టించుకునే నాథుడు లేడు.

– తోట బయ్యమ్మ



వెంకటేశ్వరస్వామి గుడి వద్ద కూర్చున్న చెంచులు



చెంచుకాలనీకి వెళ్లే రోడ్డు దుస్థితి



నిర్మాణ దశలో నిలిచిపోయిన విడిది భవనం

నిర్మాణానికి ఎన్నేళ్లు కావాలి?

- అసంపూర్తిగా పర్యాటకుల విడిది భవనం
- ఏడేళ్ల క్రితం పనులు ప్రారంభం
- నేటికీ పూర్తికాని వైనం

పగిడ్యాల: ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్ వద్ద రూ.కోటి వ్యయంతో నిర్మాణం చేపట్టిన పర్యాటకుల విడిది భవనం అసంపూర్తిగా మిగిలిపోయింది. దాదాపు 7 ఏళ్లుగా ఈ భవనం నిర్మాణ దశలోనే ఆగిపోవడం వలన ప్రజా ధనం దుర్వినియోగమైందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ముచ్చుమర్రి ఎత్తిపోతలను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ఈ భవన నిర్మాణం కోసం రూ.కోటి కేటాయించగా పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ విశ్వనాథ్ భవన నిర్మాణ పనులను శరవేగంగా చేపట్టారు.

స్లాబ్ పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్ నిధుల జాప్యంతో భవన నిర్మాణాన్ని మధ్యలో నిలిపేశారు. ఇప్పటికైనా టూరిజం అధికారులు స్పందించి అసంపూర్తిగా మిగిలిపోయిన పర్యాటకుల విడిది భవనాన్ని పూర్తి చేయించి వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

వారపు సంతలో వర్షం కష్టాలు



వర్షంలోనే వారపు సంత

పాములపాడు: స్థానికంగా ఆదివారం నిర్వహించిన వారపు సంతకు వర్షం కష్టాలు తెచ్చింది. ఈ వారపు సంతకు మండలంలోని కంబాలపల్లి, చెలిమిల్ల, రుద్రవరం, మిట్టకందాల గ్రామాలతో పాటు జూపాడుబంగ్లా మండలంలోని రామసముద్రం గ్రామాల నుంచి ప్రజలు కూరగాయలు, నిత్యావసర సరుకుల కొనుగోలుకు వస్తారు. సాయంత్రం వేళ వినియోగదారులతో రద్దీగా ఉంటుంది. కాగా ఆ సమయంలోనే ఒక్కసారిగా వర్షం కురవడంతో వినియోగదారులు, దుకాణదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దుకాణదారులు గొడుగులు, రెయిన్‌కోట్లు ధరించి దుకాణాల వద్దే వర్షంలో తడుస్తూ కూర్చున్నారు. వర్షం కురవక ముందే కొనుగోలుకు వచ్చిన ప్రజలు వర్షంలో తడుస్తూనే కూరగాయలు కొనుగోలు చేయాల్సి వచ్చింది. సరైన సదుపాయాలు లేకపోవడంతో తీవ్ర ఇక్కట్లు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.